జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ శాఖకు ఐదు పోస్టులు మంజూరు

జగిత్యాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ శాఖకు ఐదు పోస్టులు మంజూరు చేస్తూ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయానికి ఒకటి సూపరింటెండెంట్, ఒకటి సీనియర్ అసిస్టెంట్, ఒకటి జూనియర్ అసిస్టెంట్, రెండు ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను మంజూరు చేశారు. ప్రస్తుతం కరీంనగర్‌లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ రజిత, జూనియర్ అసిస్టెంట్ రత్నయ్య, అటెండర్ మణిశర్మలను డిప్యూటేషన్‌పై జగిత్యాలలో నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

మృతుడి కుటుంబానికి పరామర్శ

రాయికల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో అనారోగ్యంతో మరణించిన వారి కుటుంబాలను బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణి ప్రవీణ్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆకుల మహేష్, మాజీ అధ్యక్షుడు అన్నవేణి వేణు, పీఏసీఎస్ చైర్మన్ ముత్యం రెడ్డి, తీపిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, కోల శంకర్, నరేంద్రుల రవి, వట్టిమల్ల శ్రీనివాస్, మహేష్, జగన్, రమేష్ రెడ్డి, కంటె భూమేష్, గంగరాజం పాల్గొన్నారు.

రంగోలి పోటీలు

జగిత్యాల అర్బన్, నవంబర్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు రంగోలి, మెహందీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ గ్రామాలనుంచి వచ్చిన విద్యార్థులు అందమైన ముగ్గులు వేసి అలరించారు. అనంతరం విద్యార్థులు మెహందీ పోటీలలో భాగంగా పలువురికి మెహెందీ అందమైన డిజైనల్‌లో మెహెందీ పెట్టారు. మెహెందీ కార్యక్రమానికి సరోజన, తరంగిణి, అనితలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించగా రంగోలి కార్యక్రమానికి జమున, చందన, బి. కవిత, తదితరులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆయా కార్యక్రమాలలో కేంద్ర గ్రంథాలయ సంస్థ పాలకురాలు శకుంతల, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వం 8
కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

వైభవంగా గోదావరి హారతి 7
భక్తుల ప్రత్యేక పూజలు



రైతు భరోసా అందేదెన్నడో?

- యాసంగి పెట్టుబడి సాయం ఊసెత్తని సర్కారు
- రైతుకు భారంగా మారుతున్న విత్తనాలు, ఎరువుల కొనుగోలు
- సకాలంలో అందించాలని వినతి

జగిత్యాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్ మొదలైనా ప్రభుత్వం రైతు భరోసాపై స్పష్టత ఇవ్వడం లేదు. ఈ యేడాది వానాకాలం సీజన్‌లో అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతినడంతో సాగు కోసం చేసిన అప్పులను రైతులు తిరిగి చెల్లించలేక పోయారు. దీంతో కొత్తగా అప్పులు పుట్టని దుస్థితి ఏర్పడింది. యాసంగి సీజన్ ప్రారంభమైనా చేతిలో డబ్బులు లేక పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాలో 2,48,550 మంది రైతులు ఉన్నారు. ఇందులో రెండున్నర ఎకరాల్లోపు రైతులు 1,79,86 మంది, రెండున్నర ఎకరాల నుంచి ఐదు ఎకరాల వరకు రైతులు 52,692 మంది, ఐదు ఎకరాల పైన రైతులు 16,032 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ యేడాది వానాకాలం సీజన్‌లో 2,17,606 మంది రైతులకు రూ. 216 కోట్ల రైతు భరోసాను అందించారు.

పెట్టుబడి ఖర్చుల కోసం..


పెట్టుబడి ఖర్చుల కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా రైతులకు అండగా ప్రభుత్వం రైతు భరోసా పథకం అమలు చేస్తోంది. ఎకరాకు రెండు పంటలకు కలిపి రూ.15 వేల చొప్పున ఇస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చింది. బడ్జెట్ సమస్య కారణంగా ఎకరాకు రూ.12 వేలకు తగ్గించింది. ఈ వానాకాలం సీజన్‌లో తొలుత ఎకరం లోపు, తర్వాత ఎకరం, రెండెకరాలు, మూడు, నాలుగు, అయిదు, ఆపైనా పరిమితి లేకుండా అందరికీ రైతు భరోసా అందించింది. పెట్టుబడి సాయం అందడంతో రైతులు వానాకాలం పంటలను అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. అధిక వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈసారి యాసంగి సీజన్‌లో ఆదుకుంటుందని గంపెడాశతో ఉన్నారు.

జిల్లాలో 3.95 లక్షల ఎకరాల సాగు అంచనా..

జిల్లాలో యాసంగి సీజన్‌లో సుమారు 3,95,555 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారన్న అంచనా ఉంది. ఇందులో ప్రధానంగా వరి పంటను సాగు చేయనున్నారు. జిల్లాలో వరి పంట 3,02,600 ఎకరాలు, మొక్కజొన్న 35,000 ఎకరాలు, నువ్వులు 11,000 ఎకరాలు, మామిడి 38,300 ఎకరాలు, పల్లి 320 ఎకరాలు, జొన్నలు 2,300 ఎకరాలు, మిరప 750 ఎకరాలు, చెరుకు 190 ఎకరాలు, ఆయిల్ పామ్ 4,200 ఎకరాలు, పెసర, మినుము, ఆలసంద, ఆవా లు, కందులు తదితర పంటలు 895 ఎకరాల్లో సాగు అవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తు న్నారు. ఇందులో పది నుంచి ఇరవై శాతం హెచ్చుతగ్గులు ఉండవచ్చన్న అభిప్రాయం వెలి బుచ్చుతున్నారు.

విత్తనాలు, ఎరువుల అవసరాలు ఇలా..

జిల్లాలో యాసంగి సీజన్‌లో యూరియా 39,100 టన్నులు, డీఏపీ 16,219 టన్నులు, పొటాష్ 8,148 టన్నులు, సూపర్ 5,231 టన్నులు, కాంప్లెక్స్ 36,000 టన్నులు అవసరముంటుందని అంచనా వేశారు. అదేవిధంగా వరి విత్తనాలు 75,750 క్వింటాళ్లు,



మిగతా 8లో

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

-మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి అడ్లూరి

ధర్మపురి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ యువత ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, పెగడపల్లి ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములుగౌడ్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, ఏఎంసీ వైస్‌చైర్మన్ సంగ నర్సింహులు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అప్పం తిరుపతి, ధర్మకర్తలు రాపర్తి సాయికిరణ్, ఏదులాపురం మహేందర్, గుడ్ల రవీందర్, నేదునూరి శ్రీధర్, సంగనభట్ల నరేందర్, సింహరాజు ప్రసాద్, సీపతి సత్యనారాయణ, ఆశెట్టి శ్రీనివాస్, ఒజ్జల లక్ష్మణ్, జంగిలి ప్రభాకర్, నగునూరి నర్సాగౌడ్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

-ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



ఇందిరమ్మ లబ్ధిదారులతో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సారంగాపూర్, నవంబర్, 19 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల అభివృద్ధే తన ధ్యేయం అని, నియోజక వర్గ ప్రజలే ముఖ్యమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం మండలానికి చెందిన 89 మంది లబ్ధి దారులకు ఇళ్ళ మంజూరి పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ జయంతి రోజు ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ళ పథకంతో పేద ప్రజల సొంతింటి కల సాకారం అవుతుందని చెప్పారు. ఇప్పటికీ మండలంలో 571 మందికి ఇళ్ళు మంజూరి చేయడం జరిగిందని తెలిపారు. రూ.కోటి 62 లక్షల నిధులు లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వహిదొద్దిన్, ఎంపీడీవో గంగాధర్, ఆర్ఐ వెంకటేష్, ఎంపీవో సలీం, పీఏసీఎస్ చైర్మన్‌లు గురునాథం మల్లారెడ్డి, నర్సింహరెడ్డి, పలువురు నాయకులు, లబ్ధి దారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై దృష్టి సారించాలి



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

జగిత్యాలరూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆరోగ్యంపై దృష్టి సారించాలని జగిత్యాల పట్టణ ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం జగిత్యాల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపల్లి గ్రామంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో విద్యార్థినిలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు రక్తహీనత సమస్యలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బాలికలకు 62 మంది విద్యార్థినిలకు రక్తపరీక్షలు నిర్వహించారు. 43 మంది విద్యార్థినిలు రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించామని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ కోశాధికారి డాక్టర్ కోటగిరి సుధీర్‌కుమార్, స్త్రీ వైద్య నిపుణరాలు డాక్టర్ కోటగిరి స్వరూప, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రమ, ఎంఈవో గంగాధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



చెరువులో చేప పిల్లలు వదులుతున్న మంత్రి అడ్లూరి

వెల్గటూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. వెల్గటూర్ మండలం స్తంభంపల్లి పెద్ద చెరువులో సంక్షేమశాఖ మంత్రి జిల్లా మత్స్య శాఖ అధికారులతో కలిసి గురువారం 48,500 ఉచిత చేప పిల్లలు పంపిణీ చేశారు. అనంతరం వెల్గటూర్ మండలానికి చెందిన 29 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ప్రొసీడింగులను అధికా రులతో కలిసి అందజేశారు. అంతకు ముందు స్తంభంపల్లి గుట్టపై కొలువైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డిసెంబరు మూడో వారంలో సర్పంచ్ ఎన్నికల ప్రక్రియ

డిసెంబరు మూడో వారంలోపు గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల ప్రక్రియ ప్రాంభంచడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్త శుద్ధితో ఉందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాజబాబు, జిల్లా మత్స్యశాఖ అధికారి సురేష్ బాబు, తహశీల్దార్ శేఖర్, ఫీల్డ్ ఆఫీసర్ అశోక్, ఎంపీడీవోలు వెంకట ప్రసాద్, కృపాకర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేంధర్‌రెడ్డి, గోల్ల తిరుపతి, మెరుగు మురళి, పూదరి రమేష్, బందెల ఉదయ్, శ్రీకాంత్‌రావు, వెంకటేష్, సందీప్‌రెడ్డి, నాగుల రమేష్, తిరుపతి, నరేష్, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

జగిత్యాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో యావర్ రోడ్డుపై అక్రమ నిర్మాణాలను తొలగించాలని మజీ మంత్రి జీవన్‌రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భవన నిర్మాణాలకు అనుమతులు పొందిన నిర్మాణదారులు వారి అనుమతులకు భిన్నంగా ఇరువైపుల సెట్ బ్యాక్ లు పాటించకుండా నిర్మించడం వలన రోడ్డు యిరు కుగా మారి రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు.

మాల మహానాడు నాయకుల ఫిర్యాదు

జగిత్యాలరూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల రూరల్ మండలంలోని వెల్దుర్తి గ్రామంలో ఓ వర్గానికి చెందిన వారు ఎలాంటి అనుమతులు లేకుండా డ్రైనేజీ నీటిని తమ ఇండ్ల వైపు వచ్చే విధంగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ వెల్దుర్తి దళితులు బుధవారం కలెక్టరేట్ ఏవోకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై వారిని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని వారి పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు చిత్తారి ప్రభాకర్, కారంగుల వసంతరావు, వెల్దుర్థి మాలసంఘ సభ్యులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలి

● డీఈవో రాము



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో రాము

కథలాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాధికారి రాము హెచ్చరించారు. బుధవారం మండంలోని సిరికొండ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయం నిర్వాహణ ఎలా చేస్తున్నారని ప్రధానోపాధ్యాయురాలు వసంతను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చదివిన పుస్తకాలకు సంబంధించి విద్యార్థులతోనే సంతకాలు సేకరించాలని సూచించారు. ఉర్దూ మీడియం పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించి మెనూ ప్రకారం అందించకపోవడం నిర్వాహకులను మందలించారు. కోడిగుడ్డు వారంలో మూడుసార్లు అందించాలని పేర్కొన్నారు. పాఠశాలలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల, ఉపాధ్యాయులు ఎఫ్ఆర్ఎస్‌ను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ రాజేశ్, సీఆర్పీ విజయ్ ఉన్నారు.

రైతులు వరి కొయ్యలను కాల్చవద్దు

రాయికల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు వరి కొయ్యలను కాల్చవద్దని రాయికల్ మండల వ్యవసాయ అధికారి ముక్తీశ్వర్ అన్నారు. వరి కొయ్యలను కాల్చకుండా ఉండటానికి, పంట కోసిన తర్వాత వాటిని పొలంలోనే దున్నాలని, ఇలా చేయడం వల్ల వరి కొయ్యలు, గడ్డి భూమిలో కలిసి సేంద్రియ ఎరువుగా మారి, భూసారాన్ని పెంచుతాయని అన్నారు.

'మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి'

జగిత్యాల అర్బన్, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తున్నదని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మీ అన్నారు. ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం జగిత్యాల పట్టణంలోని భగినీ నివేదిత ఆశ్రమంలో నీరీ మహిళా ఆరోగ్య సంకల్ప్ ప్రియదర్శిని ఉడాన్ కార్యక్రమంలో బాగంగా విద్యార్థులకు జిల్లా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో న్యాప్ కిన్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళా కాంగ్రెస్ సభ్యత్వాల ద్వారా సేకరించిన నిధులతో ప్రియదర్శిని ఉడాన్ పేరుతో ఈ కార్యక్రమానికి స్వీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిత, రూప పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

● రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారీఖ్ అన్వర్



మాట్లాడుతున్న మైనార్టీ కమిషన్ చైర్మన్ తారీఖ్ అన్వర్

జగిత్యాల అర్బన్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారీఖ్ అన్వర్ అన్నారు. బుధవారం ఆయన జగిత్యాల జిల్లాను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌజమ్, ఇమామ్‌ల జీతాలు సరైన సమయంలో అందే విదంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకు ముందు అయన మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్ వసతులు, మైనార్టీ విద్యాలయాలలో ప్రీ, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు మెట్రిక్ స్కాలర్ షిప్‌లు, గురుకులాల్లో అందించే ఆహారం తదితరాల గూర్చి సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకు ముందు కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు అదనపు కలెక్టర్ బిఎస్ లత, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకట రమణలు స్వాగతం పలికారు.

సమాజ సేవ చేయాలి

మనిషికి సేవ చేస్తే ఆ భగవంతునికి సేవ చేసినట్టేనని మైనార్టీ కమీషన్ చైర్మన్ తారీఖ అన్వర్ అన్నారు. బుధవారం జగిత్యాల పట్టణంలోని గంజ్ రోడ్‌లో జమాతే ఇస్లామీ హింద్ జగిత్యాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫారన్ క్లినిక్‌ను ఫ్యామిలి హెల్త్ కేర్‌ను ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మెడిసిన్‌లో ఎండి పూర్తి చేసిన డాక్టర్ బుష్రాతో పలువురిని ఆయన సన్మానించారు. ఆయా కార్యక్రమాలలో జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షులు అజారుద్దీన్, అబ్దుల్ భారీ, ముజాయిద్, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించాలి

మల్లాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని మండల ఉద్యాన విస్తరణ అధికారి శ్రీలత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను వివరించారు. వరి పంట కన్నా ఆయిల్ ఫామ్ సాగు ఎంతో లాభాదాయకమని, రైతులు ఆయిల్ ఫామ్ పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రంగరావుపేట గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు కోసం ట్రాన్స్‌కో ఏడీ అమరెంధర్ పరిశీలించారు. బుధవారం గ్రామంలోని నాయకులు, రైతులతో కలిసి ప్రభుత్వ భూమిని పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏడీ అమరెంధర్ మాట్లాడుతూ రంగరావుపేట పరిధిలోని కేసీఆర్‌తండా, అల్లూరి సీతారామతండాలలోని విద్యుత్ సమస్యలు పరిష్కరించడానికి సబ్ స్టేషన్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట నాయకులు యెల్ల చంద్రయ్య, తెడ్డు వెంకటేష్, బాలరాజు, రాజు, సంగెపు రమేష్, బందెల శంకర్ ఉన్నారు.

ఝాన్సీ లక్ష్మీబాయి పోరాటం స్ఫూర్తిదాయకం



ఝాన్సీలక్ష్మీబాయి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):వీరనారి ఝాన్సీలక్ష్మీబాయి పోరాటం స్ఫూర్తిదాయకం అని భారత్ సురక్షాసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు అన్నారు. లక్ష్మీబాయి జయంతి సందర్భంగా భారత్ సురక్షాసమితి ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తా వద్ద ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతదేశాన్ని గడగడలాడించిన వీరనారి ఝాన్సీ లక్ష్మీభాయి సాహసం నేటి తరానికి స్ఫూర్తిదాయకం అన్నారు. శత్రవు ఎంత బలవంతుడైనా మొక్కవోని ధైర్యంతో స్వాభిమానం కోసం అంతిమ శ్వాస వరకు పోరాటం చేశారని కొనియాడారు. మహిళలు రణరంగంలో విజృంభిస్తే అపరకాళీ అవతారమేనని అని నిరూపించారన్నారు. ఈ కార్యక్రమంలో సురక్షా సమితి బాధ్యులు అక్కినపెల్లి కాశీనాథం, సింగం గంగాధర్, వేములు పోచమల్లు, చిట్ల గంగాధర్, గంద్ర ప్రసాద్‌రావు, బాలన్న, బండారి మల్లికార్జున్, శ్రీనివాస్, ప్రభాకర్, భూమన్న, రాంచంద్రం, గంగారాం, సూర్యప్రకాష్ తదితరులున్నారు.

సెస్ కార్యాలయంలో కొనసాగిన తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

సిరిసిల్ల రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘంలో రెండో రోజు బుధవారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేసి పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. సెస్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ఇటీవల పలువురు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్ నుంచి విజిలెన్స్ సీఐ అనిల్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, విజిలెన్స్ ఏఈ శ్రీకాంత్‌గౌడ్ బృందాలతో సెస్ కార్యాలయానికి చేరుకుని ఆర్థిక లావాదేవీల రికార్డులతో పాటు కంప్యూటర్‌లలో ఉన్న వివరాలను పరిశీలించారు. రికార్డులను తమ వెంట తీసుకెళ్లారు. ఫిర్యాదులకు సంబంధించిన పూర్తి వివరాలతో పాటు రికార్డులు లేకపోవడంతో బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్ మరోసారి కార్యాలయానికి వచ్చి అవసరమైన వాటిని సీజ్ చేసి తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామశివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి బుధవారం తెలిపారు. మండలంలోని రాచర్లగొల్లపల్లి గ్రామానికి చెందిన అందె చంద్రయ్య ఈ నెల 18న తన కారులో పనినిమిత్తం సిరిసిల్లకు వెళ్లి అదేరోజు రాత్రి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో హరిదాస్‌నగర్ గ్రామ శివారులో గుర్తు తెలియని లారీ అతివేగంగా చంద్రయ్య కారును ఢీకొట్టిందని చెప్పారు. ప్రమాదంలో కారు ముందు భాగం ధ్వంసమైందని పేర్కొన్నారు. కారులో ప్రయాణిస్తున్న చంద్రయ్యకు గాయాలు కాలేదని తెలిపారు. బాధితుడు చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రాహుల్ రెడ్డి వివరించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

ముత్తారం, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఓరుగంటి రవీందర్‌రావు ఇంట్లో గుర్తు తెలియని దొంగలు మంగళవారం అర్ధరాత్రి చొరబడ్డారు. ప్రస్తుతం రవీందర్‌రావు హన్మకొండలో నివాసముంటుండగా, వారం రోజులకు ఒకసారి ఇక్కడికి వచ్చి వెళ్తుంటాడు. రోజు తాళం వేసి ఉండటాన్ని గమనించిన దొంగలు ఇదే అదునుగా భావించి తాళం పగలగొట్టి ఇంట్లో చొరబడి విలువైన వస్తువుల కోసం వెతికారు. ఈ క్రమంలో అంతా చిందరవందరగా పడేశారు. అయితే విలువైన వస్తువులేమీ దొరకకపోవడంతో దొంగలు వెనుదిగారు. మరుసటి రోజు బుధవారం ఇంట్లో పనిచేసే పనిమనిషి ఇంటికి వచ్చి తాళం పగిలి ఉండటాన్ని గుర్తించి, పక్కనే ఉన్న రవీందర్‌రావు బంధువులకు తెలిపారు. దీంతో వారు రవీందర్‌రావుకు, ముత్తారం పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ముత్తారం పోలీసులు.. క్లూస్ టీంతో అక్కడికి చేరుకొని ఆధారాలను సేకరించారు. రవీందర్‌రావు అందుబాటులో లేకపోవడంతో అతని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ముత్తారం ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

జగిత్యాలరూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం ఒడ్డెరకాలనీకి చెందిన కందిరాజు(32) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు జగిత్యాల రూరల్ ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. రాజు కొన్ని రోజులుగా చెడు కలలు వస్తున్నాయని భయపడుతుండేవాడు. ఈ క్రమంలోనే బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

జగిత్యాల టౌన్ నవంబర్, 19 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం ఢీకొని జగిత్యాల పట్టణంలోని అయ్యప్ప కాలనీకి చెందిన పిప్పరి కిషన్ (78) అనే వృద్ధుడు మృతిచెందాడు. ఉదయం కూరగాయాల మార్కెట్‌కు వెళ్లేందుకు కరీంనగర్ డెయిరీ సమీపంలో ఆటో కోసం వేచి చూస్తున్నాడు. ఈ క్రమంలో దరూర్ వైపు నుంచి వస్తున్న ద్విచక్రవాహనం పిప్పరి కిషన్‌ను ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కిషన్ మృతిచెందాడు. కుమారుడు పిప్పరి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి



రాజ్‌కుమార్(ఫైల్)

సారంగాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన శివరాత్రి రాజ్‌కుమార్ (21) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ బుధవారం హైదరాబాద్ ఆసుపత్రిలో మృతిచెందాడు. రాజ్‌కుమార్ ఈనెల 16న రాజ్‌కుమార్ తన మిత్రుడు సూర రాజుతో కలిసి ఓ శుభాకార్యానికి ద్విచక్ర వాహనంపై గొల్లపల్లి మండలం చిల్వకోడూర్ గ్రామానికి వెళ్ళి వస్తుండగా కారు ఢీకొంది. రాజ్‌కుమార్ తలకు బలమైన గాయం కావడం పరిస్థితి విషమించడంతో చికిత్స నిమిత్తం హైదారాబాద్ తరలించగా బుధవారం మృతి చెందాడు.

జాతీయ ప్లాట్ ఫాం.. మై స్కీం



● ఒకే గొడుగు కిందకు ప్రభుత్వ పథకాలు

చొప్పదండి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ ఇండియాలో భాగంగా వ్యవసాయం, విద్య, వైద్యం, బ్యాంకింగ్, సబ్సిడీ రుణాలు, పీఎంఈజీపీ లాంటి 4,330 పథకాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చింది కేంద్ర ప్రభుత్వం. అర చేతిలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ఈ సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. లబ్ధిదారులు పథకాల కోసం వెతకకుండా ఒకే సైట్‌లో అన్ని పథకాలను కేంద్రం చేర్చింది. నేషనల్ ఈ గవర్నెన్స్ డివిజన్ అభివృద్ధి చేసి నిర్వహిస్తున్న మై స్కీం దేశంలోనే జాతీయ ప్లాట్ ఫారంగా పేరొందింది. కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ, రాష్ట్రాల భాగస్వామ్యాన్ని ఈ ప్లాట్ ఫారాన్ని నిర్వహిస్తున్నారు. నిరుపేద, నిరుద్యోగ యువతకు ఈ సైట్ ఎంతగానో ఉపయోగపడుతుంది.

● మై స్కీంలో 4,330 పథకాలు..

జాతీయ ప్లాట్‌ఫాం మై స్కీంలో కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సైట్‌లో చేర్చారు. కేంద్ర ప్రభుత్వంలోని 590 పథకాలు, దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 3,740 పథకాలను మై స్కీం సైట్‌లో పొందుపర్చారు. లబ్ధిదారులు తమకు కావాల్సిన పథకాన్ని ఈ సైట్‌లో ఎంచుకుని దరఖాస్తు చేసుకోవచ్చు. 15 రంగాలకు సంబంధించిన పథకాలను ఇందులో చేర్చారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించిన 718 పథకాలు, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ 293, విద్య 1,068, బిజినెస్ 622, వైద్యరంగం 255, గృహ నిర్మాణం 118, న్యాయ, ప్రజారక్షణకు సంబంధించిన 27 పథకాలు ఈ ప్లాట్‌ఫాంలో ఉన్నాయి. ఐటీ కమ్యూనికేషన్స్ 96, స్కిల్ ఎంప్లాయిమెంట్ 350, సాంఘిక సంక్షేమ సాధికారత 1,447, క్రీడలు, సాంస్కృతిక విభాగం 247, రవాణా, మౌళిక సదుపాయాలు 77, టూరిజం 67, పారిశుద్యం 48, స్త్రీ, శిశు సంక్షేమానికి సంబంధించిన 437 పథకాలు మై స్కీం సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. పీఎంఈజీపీ లాంటి సబ్సిడీ రుణాలు, వ్యవసాయ రంగానికి సంబంధించిన సబ్సిడీ పథకాలు అనేకంగా ఈ సైట్‌లో అందుబాటులో ఉన్నా యి. ఒకే గొడుగు కిందకు వేలాది పథ కాలు అందుబాటులో ఉండగా లబ్దిదా రులకు అరచేతిలోనే సంపూర్ణ సమాచారం దొరుకుతుంది.

● పథకాన్ని ఎంచుకోవడం ఇలా...

గూగుల్‌లోకి వెళ్లి www.myscheme.gov.in లోకి వెళ్లగానే స్కీంల వివరాలు వస్తాయి. మీ కోసం స్కీం అనే ట్యాగ్‌లైన్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేయగానే మీ గురించి వివరాలు నింపాలి. పూర్తి సమాచారాన్ని నమోదు చేసిన తర్వాత మీ అర్హతను, వివరాలను బట్టి మీకు అందుబాటులో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు కనిపిస్తాయి. వీటిని క్లిక్ చేయగానే వందలాది పథకాలు మీకు తెలిసిపోతాయి. పథకం వివరాలు, విషయాలు, అర్హత చూసుకుని మీరు ఎంచుకున్న పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

సౌదీలో హన్మాజిపల్లివాసి మృతి



వీరయ్య (ఫైల్)

గన్నేరువరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం సౌదీ అరేబియాకు వెళ్లిన మండలంలోని హన్మాజిపల్లికి చెందిన వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని హన్మాజిపల్లికి చెందిన పారునంది వీరయ్య(44) ఉపాధి కోసం పది నెలల క్రితం సౌదీ వెళ్లాడు. అక్కడ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం ఉదయం కారులోనే గుండెపోటుతో మృతి చెందాడు. వీరయ్యకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడానికి ప్రభుత్వం సహాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



రాములు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లోని వ్యక్తి లంబ రాములు(51) ఈనెల 18న పురుగుల మందు తాగి బలవన్మరణానికి ఒడిగట్టాడని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆయన, కుటుంబీకుల కథనం మేరకు.. గ్రామంలోని రైతు లంబ రాములు వ్యవసాయం చేయడంతో పాటు పాల వ్యాపారం చేస్తూ కుటుంబీకులను పోషిస్తుండేవాడు. యేడాది కిందట మానసిక స్థితి బాగులేక ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. తిరిగి కొన్ని రోజులకు ఇంటికి చేరుకున్న ఆయన గత నెల పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కోలుకున్న ఆయన ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈనెల 18న ఇంటిలో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య లక్ష్మీ, కొడుకులు వేణు, జోసెఫ్, కూతురు పుష్పలత ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

సైబర్ నేరగాళ్లకి సహకరిస్తున్న ఒకరి అరెస్ట్

విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్ట్, క్రిప్టో ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, టాస్క్‌బేస్డ్ పార్ట్‌టైం జాబ్స్, వాట్సాప్ ఇంప్రోసోనేషన్ స్కామ్ బాధితుల నుంచి సైబర్ మోసం ద్వారా కొల్లగొట్టిన డబ్బులను మ్యూల్ అకౌంట్లతో విత్ డ్రా చేసి వాటిని సైబర్ నేరగాళ్లకు క్రిప్టో కరెన్సీగా మార్చి అందించిన తెలంగాణలోని జగిత్యాల జిల్లా వ్యక్తిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. విశాఖ నగరానికి చెందిన వ్యక్తికి ఒక నెంబర్ నుంచి వాట్సాప్ మెసేజ్ వచ్చింది. స్నేహితుడినంటూ నమ్మించి ప్రస్తుతం డబ్బులు అవసరమని చెప్పి మూడు అకౌంట్లలోకి కోటి రూపాయల వరకు బదిలీ చేయించుకున్నారు. మోసపోయినట్లు గుర్తించి నేషనల్ సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. వారు సమగ్ర దర్యాప్తు చేయగా తెలంగాణలోని జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలానికి చెందిన లక్కుల మనోజ్ అకౌంట్ల నుంచి క్రిప్టో కరెన్సీగా మార్చి సైబర్ నేరగాళ్లకి అందించినట్లు గుర్తించి సైబర్ క్రైం పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి



సిద్ధార్థ్ (ఫైల్)

శంషాబాద్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ ఇంజనీరింగ్ విద్యార్థి మృతిచెందిన సంఘటన బుధవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం, దొంతపూర్ గ్రామానికి చెందిన రామటెంకి సిద్దార్థ్ (22) మండల పరిధిలోని కాచారం వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో నాల్గవ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం తన స్నేహితుడు రోహిత్‌తో కలిసి బైకుపై సాయంత్రం 6.30 గంటలకు కళాశాల వైపు వెళ్తున్నాడు. నర్కూడ దాటిన తరువాత చాయ్ దునియా హోటల్ సమీపంలో మల్కారం నుంచి వస్తున్న ఆటో ట్రాలీ వీరి వాహనాన్ని ఢీకొంది. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన వాహనాదారులు గాయపడిన వారిని శంషాబాద్ ట్రైడెంట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న సిద్దార్థ్ రాత్రి 9 గంటలకు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. కొడుకు మృతి తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోయారు. పోలీసులు గాంధీ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బైక్‌పై ఉన్న మరో విద్యార్థికి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదానికి కారణమైన ఆటోను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

గాలిపల్లిలో ఎలుగుబంటి సంచారం

ఇల్లంతకుంట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాలిపల్లి గ్రామ సమీపంలో మరోసారి ఎలుగుబంటి సంచరించిందని గ్రామస్థులు తెలిపారు. గ్రామసమీపంలోని వరదకాలువ కట్టపై బుధవారం ఉండగా పలువురు గమనించారు. పదిరోజుల క్రితం గాలిపల్లి సమీపంలోని ఎస్సీ బాలుర హాస్టల్ సమీపంలో రైతులకు ఎలుగుబంటి కనిపించింది. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

పెద్దపల్లి రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పన్నపేట గ్రామం వద్ద రాజీవ్‌రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం మండలం బొట్లవనపర్తి గ్రామానికి చెందిన నర్సయ్య గోదావరిఖని నుంచి సొంత గ్రామానికి వెళ్తున్న క్రమంలో అప్పన్నపేట వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో గాయాలు కాగా అతడిని స్థానికులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు.

కల్వచర్లలో చోరీ

రామగిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్లలో కొంత బాపు అనే రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగింది. తాళం వేసి ఉన్న బాపు కుటుంబం రెండు రోజుల క్రితం ఆసుపత్రికి వెళ్లారు. కాగ బుధవారం తలుపులు తెరిసి ఉండడంతో దొంగలు పడ్డట్లుగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దొంగలు ఇంటి గడియ విరగగొట్టి లోనికి ప్రవేశించారు. ఇంట్లో గల రూ.15వేల వరకు చోరీ చేసినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఏఎస్ఐ స్వామి ఆధ్వర్యంలో డాగ్‌స్క్వాడ్, ఫోరెన్సిక్ నిపుణులు పరిశీలన జరిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బొమ్మకల్ శివారులో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు, మానకొండూర్‌కు చెందిన డ్రైవర్ సయ్యద్ మీర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్‌జీ ఎక్కడ?

● పోలీసుల అదుపులో ఉన్నాడనే ప్రచారం

● ఆందోళనలో కుటుంబ సభ్యులు



దేవ్‌జీ సోదరుడు గంగాధర్, సోదరుడి కూతురు సుమ

కోరుట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్‌జీ అలియాస్ తిప్పరి తిరుపతి ఆంధ్రప్రదేశ్ పోలీసుల అదుపులో ఉన్నాడన్న సోషల్ మీడియా ప్రచారంతో జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన ఆయన కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇటీవల మావోయిస్టు అగ్ర నాయకుడు, కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా మృతి చెందారు. ఇదే సమయంలో మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్‌జీ అలియాస్ తిప్పరి తిరుపతిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్న వార్త సోషల్ మీడియాలో వైరల్ అయింది. దేవ్‌జీ ప్రొటెక్షన్ టీంలోని తొమ్మిది మంది సభ్యులను పోలీసులు అరెస్టు చేసినట్లు వస్తున్న వార్తలతో ఆయన కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది. 1980లో కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన తిరుపతి ఆర్‌ఎస్‌యూలో కీలక కార్యకర్తగా పని చేశారు. 1983లో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూ పీపుల్స్‌వార్ పార్టీలో చేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. పార్టీలో వివిధ అగ్ర నాయకత్వంలో పని చేసి కేంద్ర కార్యదర్శిగా 40 రోజుల క్రితం నియమితుడయ్యాడు. దేవ్‌జీ నియమితుడైనప్పటి నుంచి చోటు చేసుకున్నుంటున్న పరిణామాలకు తోడు వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో ఆయన బంధువులు ఆందోళనకు గురవుతున్నారు.

● అరెస్ట్ చేస్తే కోర్టులో హాజరు పరచాలి

- తిరుపతి సోదరుడు గంగాధర్, సోదరుడి కుమార్తె సుమ

కేంద్ర కమిటీ కార్యదర్శి, పార్టీ అగ్రనాయుడు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీని పోలీసులు అరెస్టు చేస్తే కోర్టులో హాజరు పరచాలని ఆయన తమ్ముడు తిప్పిరి గంగాధర్, తమ్ముడి కుమార్తె సుమలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పెద్ద నాన్న లొంగిపో అని గతంలో రెండుసార్లు తిప్పిరి తిరుపతి తమ్ముడి కూతురు సుమ సామాజిక మాధ్యమాల ద్వారా విజ్ఞప్తి చేశారు. దేవ్‌జీ క్షేమ సమాచారంపై ఆయన తమ్ముడు, తమ్ముడి కూతురు మరోమారు సామాజిక మాధ్యమాల ద్వారా దేవ్‌జీని కోర్టులో హాజరు పరచాలని పోలీసులను కోరారు.

ఈ నెల 26న కార్మిక సంఘాల ధర్నా

హుజూరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గీట్ల ముకుందారెడ్డి అన్నారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో కొప్పుల శంకర్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క పక్క దేశంలో రైతు నల్ల వ్యతిరేక చట్టాలను తీసుకొస్తూ వ్యవసాయాన్ని మొత్తం కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే కుట్ర చేస్తుందన్నారు. పెట్టుబడిదారులకు శ్రమ దోపిడికి గురిచేసే విధంగా కార్మిక చట్టాల సవరణ పేరుతో కార్మికుల పొట్టగొడుతుందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభ్వుం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా అఖిల భారత స్థాయిలో జరుగుతున్న ఐక్య పోరాటాలల్లో భాగంగా ఈ నెల 26న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ప్రజా అనుకూల విధానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గుండేటి వాసుదేవ్, ఎడ్ల రమేష్, రాజేశం, కొంకట చంద్రయ్య, సారయ్య, కుమార్, రత్నాకర్, మహేష్ ఉన్నారు.

సైడ్ ఇవ్వలేదని ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

● ఖండించిన మంత్రి పొన్నం ప్రభాకర్



ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేస్తున్న కారు యజమాని

ఇల్లంతకుంట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సైడ్ ఇవ్వలేదని ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేశాడు ఓ కారు యజమాని. సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ వెళ్లి ఇల్లంతకుంట మీదుగా సిరిసిల్లకు వెళుతోంది. రాజన్న సిరిసిల్ల జిల్లా వల్లంపట్ల గ్రామ సమీపంలోని సందోరిపల్లి వద్ద ఆర్టీసీ బస్సు వెనుకాల ఓ కారు వచ్చింది. రోడ్డు ఇరుకుగా ఉండటం వల్ల డ్రైవర్ సైడ్ ఇవ్వలేదు. దీంతో విచక్షణ కోల్పోయిన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం గంగాపూర్‌కు చెందిన పిట్టల శ్రీకాంత్ అనే కారు యజమాని ఆర్టీసీ డ్రైవర్ బాలరాజుపై విచక్షణా రహితంగా దాడిచేశాడు. ఆర్టీసీ బస్సులోని మహిళలు వారించినా శ్రీకాంత్ వినలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు.

● స్పందించిన మంత్రి

ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామసమీపంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విధుల్లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగిపై ఉద్దేశపూర్వకంగా దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. ప్రజా రవాణా వ్యవస్థలో ప్రయాణికుల కోసం నిరంతరం శ్రమిస్తున్న ఆర్టీసీ డ్రైవర్లపై దాడిని ఉపేక్షించేది లేదని మంత్రి హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. దాడిచేసిన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎస్పీ మహేష్ బీ గితేను ఫోన్‌లో ఆదేశించారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగునూరుకు చెందిన ఉరుసు నర్సయ్య అనే వ్యక్తి సెప్టెంబరు 29న సెల్‌ఫోన్‌ను అదే గ్రామంలో పోగొట్టుకుని కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా నిజామాబాద్‌లో ఉన్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బాధితుడిని బుధవారం రూరల్ స్టేషన్‌కు పిలిచి సీఐ నిరంజన్‌రెడ్డి చేతుల మీదుగా సెల్‌ఫోన్‌ను అప్పగించారు. సెల్‌ఫోన్ రికవరీలో కృషి చేసిన కానిస్టేబుల్ పద్మజ, విశ్వతేజను సీఐ అభినందించారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

● ప్రభుత్వ నిర్మాణాలకు అనుమతులు. ప్రైవేట్‌లో విక్రయాలు ● ఇబ్బందుల్లో ఇళ్ల యజమానులు



ఇసుక అనుమతి ఇస్తున్న రెవెన్యూ సిబ్బంది

వేములవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మూలవాగు నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ప్రభుత్వ నిర్మాణాల పేరుతో డీడీలు కట్టిన వ్యాపారులు ప్రభుత్వ నిర్మాణాలకు ఇసుకను తరలించకుండా డంపు చేసుకుంటున్నారు. రాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా ప్రైవేటులో ఎక్కువ ధరకు విక్రయించుకుని సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. వేములవాడ పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు డీడీలు తీసిన వ్యాపారులకు ఇసుక తీసుకునేందుకు అనుమతి ఇస్తున్నారు. బుధవారం మూలవాగు నుంచి ఇసుక తీసుకునేందుకు అనుమతినిచ్చారు. దీంతో ఇసుక వ్యాపారులు అదే అదనుగా ఇసుకను ఇందిరమ్మ ఇళ్లకు సరఫరా చేయకుండా మరోచోట డంపు చేసుకుంటున్నారు. ఒక్క డీడీపైన నాలుగు ట్రాక్టర్‌ల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం. రెవెన్యూ అధికారులు మాత్రం ట్రాక్టర్‌లను పరిశీలించకుండానే తమకు నచ్చిన వారికి ఇసుక అనుమతి ఇస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఇళ్ల నిర్మాణానికి ఇబ్బందులు

వేములవాడ పట్టణంలో ఇళ్ల నిర్మాణానికి ఇసుక లేక యజమానులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అనుమతి ఇవ్వడం లేదని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి నిర్మాణం చేసుకునే వారికి రెవెన్యూ అధికారులు ఇంటికి వచ్చి పరిశీలించి ఇసుక పర్మిషన్ ఇవ్వాలని నూతన ఇంటి యజమానులు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కథలాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలం కలికోట సూరమ్మ చెరువు శివారులో వేములవాడ-కోరుట్ల రహదారిపై బుధవారం తెల్లవారుజామున లారీ బోల్తా పడింది. గుంటూరు జిల్లా పిడుగురాళ్ల నుంచి కోడి ఎరువు లోడ్‌తో వస్తుండగా ఒక్కసారిగా అదుపు తప్పి పక్కనే ఉన్న గుంతల్లో పడిపోయింది. ఈ ఘటనలో డ్రైవర్ సోనురాథోడ్ సహా క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రోడ్డుపై ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది.

రేపు కరీంనగర్‌లో ఖేలో ఇండియా పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం ఖేలో ఇండియా అస్మిత అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఈ పోటీలను అండర్-14, అండర్-16 విభాగాల్లో కేవలం బాలికలకు మాత్రమే నిర్వహించనున్నామని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు నందెల్లి మహిపాల్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనుటకు ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు పుట్టిన తేదీ ధ్రువీకరణ సర్టిఫికెట్ తీసుకొని హాజరుకావాలని సూచించారు. పోటీల్లో పాల్గొనేవారు ఎస్ఎస్ఆర్ఎస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలని సూచించారు. అండర్-14 బాలికల విభా గంలో ట్రైయ థ్లాన్ ఎ 60 మీటర్లు, లాంగ్ జంప్, హైజంప్ నిర్వహిస్తారు. అలాగే ట్రయా థ్లాన్ బి 60 మీటర్లు, లాంగ్ జంప్, బ్యాక్‌త్రో, వన్ కేజీ షార్ట్‌పుట్, ట్రయా థ్లాన్ సి 60 మీటర్లు, లాంగ్‌జంప్, 600 మీటర్ల కిడ్స్ జావెలిన్ ఉంటాయి.

అండర్-16 విభాగంలో..

60 మీటర్లు 600 మీటర్లు, హైజంప్, లాంగ్ జంప్, డిస్కస్‌త్రో, షార్ట్‌పుట్ 3 కేజీ, జావెలిన్ త్రోలలో పోటీలు నిర్వహించనున్నారు. పాల్గొనే క్రీడాకారులందూ ఉదయం 8 గంటలకు ఒరిజినల్ డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌లో ప్రాంతీయ క్రీడా పాఠశాలలో హాజరుకావాల్సి ఉంటుంది.

22న జూనియర్ వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా జూనియర్ బాలబాలికల వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 22న నిర్వహించనున్నారు. కొత్తపల్లి మండలం ఎలగంగల్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ వేణుకిషన్‌రావు, గిన్నె లక్ష్మణ్ తెలిపారు. పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను ఈ నెల 29 నుంచి డిసెంబరు 2వ వరకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ వాలీబాల్ పోటీలకు ఎంపిక చేయనున్నారు. జనవరి 1, 2008 తర్వాత జన్మించి 18 సంవత్సరాల్లోపు వయస్సు గల క్రీడాకారులు పోటీలకు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకారులు ఆధార్ కార్డు, పదోతరగతి మెమో, జనన ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని, వివరాలకు ఫోన్ : 8099546565, 790100546 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

- దెబ్బతిన్న వరి, పత్తి పంటలు
- దాదాపు వెయ్యి ఎకరాల్లో పంట నష్టం
- మిడ్‌మానేరు బ్యాక్ వాటర్‌తో రైతుల కష్టాలు

పంటపొలాలు నీళ్లపాలు


మిడ్‌మానేరు బ్యాక్ వాటర్‌లో మునిగిన వరి పంట

వేములవాడ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మిడ్‌మానేరు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల చేతికి వచ్చే పంటపొలాలు నేలపాలయ్యాయి. పంట పొలాల్లోకి నీరు చేరి వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. ఆరుగాలం కష్టించి పండించిన పంట బ్యాక్ వాటర్ చేరి నేలపాలైంది. మిడ్‌మానేరు బ్యాక్ వాటర్ చేరి వరి, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో మధ్యమానేరు జలాశయంలో ముంపునకు గురైన గ్రామాల్లో దాదాపు 1000 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. పంటలు దెబ్బతినడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

● బఫర్‌జోన్ దాటి..

మిడ్‌మానేరు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ బఫర్‌జోన్ దాటింది. ప్రధానంగా బఫర్‌జోన్, సీపేజీ నిబంధనలు పాటించని కారణంగా దాదాపు 50మీటర్ల వరకు నీరు వచ్చి ప్రాజెక్టు ఆనుకొని ఉన్న పంట నేలపాలయింది. శ్రీరాజరాజేశ్వర మిడ్‌మానేరు ప్రాజెక్టును 27.87 టీఎంసీల కెపాసిటీతో నిర్మించారు. అయితే బఫర్‌జోన్ దాటి బ్యాక్‌వాటర్ రావడంతో పంటలు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంటలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో వేములవాడ అర్బన్ మండలంలోని ఆరేపల్లి, సంకెపల్లి, కొడుముంజ, రుద్రవరం, అనుపురం ముంపు గ్రామాలకు చెందిన రైతుల పంటపొలాల్లోకి నీరు చేరింది. వరి, పత్తి పంటలు నేలవాలిపోయి పంట చేతికందని పరిస్థితి ఏర్పడింది.


మిడ్ మానేరు బ్యాక్ వాటర్‌లో మునిగి దెబ్బతిన్న పత్తిపంట

కష్టపడి పండించిన పంట నేల పాలైంది..

– గుండెకార్ల లక్ష్మణ్, రైతు, ఆరెపల్లి



ఆరుగాలం కష్టపడి పండించిన పంట నేలపాలు కావడంతో తీవ్రంగా నష్టపోయాం. ఎకరం వరి వేశాను. పంట కోతకు వచ్చిన దశలో బ్యాక్ వాటర్‌చేరి నేలవాలింది. తమను ప్రభుత్వం ఆదుకోవాలి.

ఎస్సారార్ పీజీ ఫలితాలు విడుదల


ఫలితాలను విడుదల చేస్తున్న ఎస్ఆర్ఆర్ కళాశాల అధికారులు

గణేశ్‌నగర్,నవంబరు19(ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ అటనామస్ కళాశాల పీజీ రెండో, నాలుగో సెమిస్టర్ ఫలితాలను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ, ఎస్‌యూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సురేష్, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ బుధవారం విడుదల చేశారు. పీజీ రెండో సెమిస్టర్‌లో 250 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 193 మంది,77 శాతం, నాలుగో సెమిస్టర్‌లో 242 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 215 మంది 89 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఫలితాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్, రాజయ్య, టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా ఎస్సారెస్పీ నీటిమట్టం

జగిత్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరుతున్న వరద, కాలువల ద్వారా కొనసాగుతున్న ఔట్ ఫ్లో సమానంగా ఉండడంతో ప్రాజెక్టు బుధవారం నీటిమట్టం నిలకడగా ఉంది. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 9,693 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి సరస్వతీ కాలువ ద్వారా 650 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి 8 వేల క్యూసె క్కులు, తాగు నీటి అవసరాల కోసం మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 812 క్యూసెక్కుల నీరు పోతోంది.

బీసీ రిజర్వేషన్ అమలును విస్మరిస్తే అసెంబ్లీ ముట్టడి

వేములవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ అమలును విస్మరిస్తే అసెంబ్లీ ముట్టడిస్తామని బీసీ సాధికారత సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణంలోని బీసీ సాధికారిత సంఘ కార్యాలయంలో బుధవారం బీసీ ముఖ్య నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పొలాస నరేందర్ మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో బీసీలకు స్థానిక ఎన్నికల్లో, విద్య ఉపాధి, ఉద్యోగాల్లో చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్‌లు ఇస్తామని వాగ్దానాలు చేశారని గుర్తుచేశారు. కోర్టులు, కేంద్రం అడ్డుపడుతున్నాయని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. పంచాయతీ ఎన్నికలు పార్టీ పర రిజర్వేషన్లతో ఎన్నికలు జరపాలని కేబినేట్లో తీసకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఈనెల 21వ తేది నుంచి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ప్రభుత్వం బీసీల పట్ల మొండిగా వ్యవహరిస్తే ఈనెల 21వ తేదిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాలకు వినతి పత్రాలు అందజేసి నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు. అంతేకాకుండా ఈనెల 23వ తేదిన అఖిలపక్షం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తామని, 25వ తేదీన ధర్నా, రాస్తారోకో చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ సాధికారిత సంఘం నేతలు తుపుకారి సత్తయ్య, ఇల్లందుల వెంకటేష్, ఉయ్యాల భూమయ్య, చింతలకోటి రామస్వామి, ముద్రకోల గణేష్, సుధాకర్, లింగయ్య, లక్ష్మీరాజం, ప్రభాకర్, భీంరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘాల నాయకులు

కేంద్ర నిధుల కోసమే పంచాయతీ ఎన్నికలు

● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

హుజూరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, కేవలం కేంద్ర ప్రభుత్వ నిధుల కోసమే ఎన్నికలు నిర్వహిస్తోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని మధువని గార్డెన్‌లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి పోలింగ్ బూత్ అధ్యక్షులు, నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బండి సంజయ్‌కుమార్ మాట్లాడారు. ప్రధాని మోదీ సంక్షేమ పథకాలను అన్ని వర్గాలకు సమానంగా పంచుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ రెండేళ్లలో ఏ ఒక్క గ్రామపంచాయతీకైనా నయాపైసా ఇచ్చిందా? అని ప్రశ్నించారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేయవద్దన్నారు. బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే పంచాయతీలు బాగుపడుతాయన్నారు. కేంద్రం నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందన్నారు.తెలంగాణకు సీఐఆర్ఎఫ్ కింద రూ. 1200కోట్లు తీసుకువస్తే అందులో రూ.500కోట్లను కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ఖర్చు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలన వైఫల్యాలను, బీఆర్ఎస్ పదేళ్ల వైఫల్యాలను వివరిస్తూ కరపత్రాన్ని రూపొందించామని, ఇది ఇం టింటికీ అందజేస్తామని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు నరకయాతన పడ్డారని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజలు, రైతులు ఆత్మహత్యలు చేసుకునే స్థాయికి చేరారని అన్నారు. అనంతరం బండి సంజయ్‌కుమార్‌పై రూపొందించిన గీతాన్ని రాష్ట్ర సంఘటనా మంత్రి చంద్రశేఖర తివారీ విడుదల చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా ఇన్ చార్జి గంగిడి మనోహర్‌రెడ్డి, జిల్లాల అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపి, మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ, మాజీ మేయర్ సునీల్‌రావు, నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

రెన్యూవబుల్ ఎనర్జీలో ఎన్టీపీసీతో సింగరేణి ఒప్పందం

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పునరుద్ధాదక ఇంధన రంగంలో ఎన్టీపీసీ అనుబంధ కంపెనీ ఎన్‌జీఈఎల్ (ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్)తో సింగరేణి ఒక కీలక ఒప్పందం చేసుకుంది. బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గని వద్ద 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్, సోలార్ విద్యుత్‌ను 5 వేల మెగావాట్లకు పెంచాలని నిర్ణయించడం, మణుగూరు వద్ద జియో థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని యోచిస్తోందని, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ కూడా నిర్మించాలన్న లక్ష్యంగా ముందుకు పోతున్నామని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ఈ సందర్భంగా చెప్పారు. ఈ నేపథ్యంలో విద్యుత్ ఉత్పత్తి రంగంలో అపార అనుభవం గల ఎన్టీపీసీ తోనూ అనుబంధ సంస్థ అయిన ఎన్ జి ఈ ఎల్ కంపెనీ తోనూ ఒప్పందం కుదుర్చుకోవడం ఒక శుభ పరిణామమన్నారు. సింగరేణి సహకారంతో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్లను దేశవిదేశాల్లో ఏర్పాటు చేయనున్నామని, ఎన్టీపీసీ అనుబంధ సంస్థ ఎన్ జీ ఈ ఎల్ ఉన్నతాధికారి బిజినెస్ డెవలప్మెంట్ హెడ్ బిమల్ గోపాలాచారి అన్నారు. ఒప్పందం అనంతరం ప్రాజెక్టుల వారీగా సమీక్ష నిర్వహిస్తామని ఇరు పక్షాలకు లాభదాయకమైన ప్రాజెక్టులను ఎంపిక చేసి నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

హుజూరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని టీఎస్ఆర్ గార్డెన్‌లో బీసీ జేఏసీ నాయకుల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తాను ఇచ్చిన మాటను నటి మూటగా మార్చి బీసీలకు పాత రిజర్వేషన్ పద్ధతిని స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేస్తామని ఇటీవల క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారంలో వచ్చిన తర్వాత కామారెడ్డిలో డిక్లర్ చేసిన విధంగా బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ చట్టం ప్రకారం అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జనార్థన్, వెంకన్న, శ్రీనివాస్, సాగర్, సదానందం, శ్రీనివాస్, చంద్రశేఖర్, నారాయణ, శేఖర్, రాజేందర్, బాబు, రమేష్, బిక్షపతి, వెంకటేశ్వర్లు, రఘు, రవీందర్, సారయ్య పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలి

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలని, క్రీడలతో ఆత్మస్థయిర్యం పెంపొందుతుందని సిద్దిస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం యువజన క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఖేలో ఇండియా అస్మిత కిక్ బాక్సింగ్ లీగ్ 2025-26 కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని విరూపాక్షి గార్డెన్‌లో బుధవారం నిర్వహించిన అండర్ 14 బాలబాలికలకు కిక్ బాక్సింగ్ రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల ప్రారంభోత్సవాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై..పోటీలను ప్రారంభించి తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలికల్లో చదువుతో పాటు క్రీడల ద్వారా ఆత్మస్థైర్యం పెంపొందించడానికి చేపట్టిన అస్మిత ఖేలో ఇండియా క్రీడలను బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న క్రీడా కోచ్‌లను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఛైర్మన్ మంచాల కృష్ణ, నిత్య సాయి ట్రస్ట్ ఛైర్మన్ డా.రఘు, కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి మహిపాల్, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఏవిఎల్ఎన్ చారి, వివిధ జిల్లాల కోచ్‌లతో పాటు, రెఫరీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

స్వగ్రామం చేరిన గల్ఫ్ మృతదేహం

రాయికల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సౌదీ రోడ్డు ప్రమాదంలో అసువులుబాసిన వలసజీవి మృతదేహం బుధవారం రాయికల్ పట్టణానికి చేరుకుంది. రాయికల్ పట్టణానికి చెందిన సుతారి ధర్మయ్య (48) ఇటీవల సౌదీ దేశంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ధర్మయ్య మృతితో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయి తీవ్రంగా రోదిస్తున్నారు. ఉదయం స్వగ్రామానికి చేరుకున్న ధర్మయ్య శవపేటిక వద్ద కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీళ్లపర్యంతమయ్యారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. ధర్మయ్యకు భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. మృతదేహాన్ని రప్పించేందుకు అక్కడి సాటా రియాద్ శాఖ అధ్యక్షుడు మచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు తీవ్రంగా కృషి చేశారు.

కల్లులో మత్తు పదార్థాలు కలుపవద్దు


కల్లు శాంపిల్‌ను పరీక్షిస్తున్న అధికారులు

బీర్‌పూర్,నవంబరు 19(ఆంధ్రజ్యోతి):గ్రామాలలో ప్రజలు నిత్యం సేవించే తాటి కల్లు, ఈత కల్లులో మత్తు పదార్థాలు కలిపి ప్రజల ఆరోగ్యానికి హానికలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్పెషల్ ఎక్సైజ్ అధికారుల బృందం ఎస్సై ఎంఏ మాజీద్ అన్నారు. బుధవారం బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి గ్రామంలో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కల్లు మండువాలలో తాటి, ఈత కల్లు శాంపిల్ సేకరించి ప్రయోగాత్మకంగా పరీక్షలు నిర్వహించారు. సేకరించిన కల్లులో ఎలాంటి మత్తు పదార్థాలు లేవని నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్లు మహమ్మద్ గోరి, వినయ్, రజిత, కానిస్టేబుల్లు, గౌడ సంఘం అధ్యక్షులు గాజర్ల రామచంద్రం గౌడ్, గౌడ సంఘం కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న హుండీ ఆదాయం రూ. 2.03 కోట్లు

వేములవాడ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి హుండీ ద్వారా 2,03,25,676 రూపాయల ఆదాయం సమకూరింది. బుధవారం ఆలయ ఓపెన్ స్లాబ్‌లో భారీ భద్రత మధ్య 27 రోజుల హుండీలను లెక్కించారు. 228 గ్రాముల బంగారం, 14.3 కిలోల వెండి కానుకలు భక్తులు సమర్పించారు. ఈవో ఎల్ రమాదేవి, పరిశీలకులు రాజమౌళి పాల్గొన్నారు.

ఆర్టీసీ విలేజ్ బస్సు ఆఫీసర్లతో సమావేశం


ఆర్టీసీ విలేజ్ బస్సు ఆఫీసర్లను సన్మానిస్తున్న అధికారులు

భగత్‌నగర్, నవంబరు 19(ఆంధ్ర జ్యోతి): కరీంనగర్ రీజియన్ పరిధిలోని విలేజ్ బస్సు ఆఫీసర్లతో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజు బుధవారం సమావేశం నిర్వహించారు. శబరిమలై, యాత్రాదానం, బస్ ఆన్ కాంట్రాక్టు విధానంలో బుక్ చేసిన బస్సుల వివరాలను సమీక్షించారు. రానున్న రోజుల్లో విలేజ్ బస్ ఆఫీసర్లు శబరిమలై, యాత్రాదానం, బస్ ఆన్ కాంట్రాక్టు పద్ధతిలో ఎక్కువ బస్సులు చేయించాలని, సంస్థకు అధిక ఆదాయం తీసుకు రావాలని సూచించారు. ప్రతి డిపోలో ఎక్కువ సంఖ్యలో ప్యాకేజీ టూర్లు, బస్ ఆన్ కాంట్రాక్టుపై బస్సు బుక్ చేసిన విలేజ్ ఆఫీసర్లను సన్మానించారు. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ భూపతిరెడ్డి, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

చెప్పుకోలేని బాధ

● నేడు ప్రపంచ పైల్స్ దినోత్సవం

సుభాష్‌నగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మొలలను ఇంగ్లీష్‌లో పైల్స్ లేదా హేమోరాయిడ్స్ అని అంటారు. ఇవి పైల్స్ అంటే మలద్వారం దగ్గర రక్తనాళాలు ఉబ్బి బయటకు పొడుచుకు వచ్చి ఉంటాయి. సమాజంలో దాదాపు 50 శాతం మంది పైల్స్‌తో బాధపడుతున్నట్లు వైద్య నిపుణులు తెలుపుతున్నారు. మాంసాహారం ఎక్కువ తీసుకోవడం, పండ్లు, కూరగాయలు తక్కువగా తీసుకోవడం, నీరు తక్కువ తాగడం, వ్యాయామం చేయకపోవడం, చాలా సమయం కూర్చుని పని చేయడం, మలవిసర్జన సమయంలో ఎక్కువగా కడుపులో ఒత్తిడి చేయడం, మల విసర్జన పద్ధతి ప్రకారం చేయకపోవడం, గర్భిణుల్లో రక్తనాళాలపై ఒత్తిడి పడడం వంటి కారణాలతోపైల్స్ వచ్చే అవకాశం ఉంది.

● పైల్స్ వల్ల ఇబ్బందులు

పైల్స్ వచ్చిన వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారు. మల విసర్జన సమయంలో రక్తం పడుతుంది. మలద్వారం వద్ద వాపు ఏర్పడి నొప్పిగా దురదగా ఉంటుంది. రక్తనాళాల్లో రక్తం గడ్డకడుతుంది. దీంతో కూర్చోవడానికి ఇబ్బందిగా ఉంటుంది. అప్పుడప్పుడు చీము గడ్డలు ఏర్పడి అధిక రక్తస్రావం అవుతుంది. తక్కువ తీవ్రత ఉంటే ఆహారపు అలవాట్లు, వ్యాయామం, మందులతో తగ్గించుకోవచ్చు. తీవ్రత ఎక్కువగా ఉంటే ఆపరేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది.



● అవగాహన కల్పించేందుకు ప్రపంచ పైల్స్‌దినోత్సవం

పైల్స్‌పై చాలామందికి అవగాహన లేకపోవడం వల్ల సకాలంలో వైద్యుడిని సంప్రదించడం లేదు. ప్రారంభ దశలోనే వాటిని గుర్తిస్తే మందులతోనే నయం చేయవచ్చు. పైల్స్ గురించి ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ప్రతి సంవత్సరం నవంబరు 20న ప్రపంచ పైల్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సంబంధిత ఆసుపత్రులు, డాక్టర్లు పలు కార్యక్రమాలను నిర్వహించిన ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

● సకాలంలో గుర్తిస్తే మందులతో నయం చేయవచ్చు

– డాక్టర్ సురేష్‌కుమార్, పైల్స్ అండ్ మోర్ క్లినిక్ కరీంనగర్



పైల్స్ వచ్చిన వారు మలవిసర్జనకు చాలా ఇబ్బందులు పడుతుంటారు. ఇది వచ్చిన వారు ప్రారంభంలో గుర్తించి డాక్టర్‌ను సంప్రదిస్తే ఆపరేషన్ అవసరం లేకుండా మందులతో నయం చేయవచ్చు. చాలా మంది వ్యాధి ముదిరిన తరువాత వస్తుంటారు. గతంతో పోలిస్తే ఇపుడు అత్యాధునిక చికిత్స అందుబాటులో ఉంది. లేజర్ ఇన్ ఫారెస్ట్, స్టైప్లర్ బ్యాండింగ్ పద్ధతులతో చికిత్స అందిస్తాం. ఆసుపత్రిలో చేరిన 24 గంటల్లో ఆపరేషన్ పూర్తి చేసి డిశ్చార్జ్ చేస్తాము. అతి తక్కువ సమయంలోనే వారు తమ పనులు చేసుకోవచ్చు. పేషంట్‌కు ఎలాంటి నొప్పి ఉండదు.

29వ రోజు గోదావరి హారతి


ధర్మపురి వద్ద గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 29వ రోజు బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం ఆరంభం నుంచి జరిగే కార్యక్రమంలో భాగంగా ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి రాత్రి వరకు నదీ మాతకు హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి వేళలో భక్తులు, మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలి పుణ్యప్రాప్తి పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు నంబి అరుణ్‌కుమార్, వంశీకృష్ణ, అశ్విన్, అర్చకులు, ధర్మకర్తలు, శారదా మహిళా మండలి, వాసవి మహిళా మండలి సభ్యులు, కరీంనగర్ తిరుమల సేవా గ్రూపు సభ్యులు, పెద్దపల్లి శ్రీ వల్లి సేవా గ్రూపు సభ్యులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల గుర్తింపు

కథలాపూర్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన గ్రామ సభల్లో రూ.20 కోట్లతో పనులు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు ఇన్‌చార్జి ఏపీవో కొమురయ్య తెలిపారు. వ్యక్తిగత ప్రయోజనాలకు సంబంధించిన పనులు అధికంగా చేపట్టాలని నిర్ణయించామన్నారు. కోళ్ళఫారాలు, గేదెలు, ఆవుల, గొర్రెల షెడ్లు వంటి నిర్మాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఉన్నతాధికారులు సూచించిన నేపథ్యంలో వాటిపై దృష్టి సారించినట్టు తెలిపారు. అవెన్యూ, బండ్ ప్లాంటేషన్ పనులు కొనసాగుతన్నాయని చెప్పారు.

కార్తీక మాస వన భోజనాలు

జగిత్యాల టౌన్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల పట్టణంలోని శ్రీ గుట్ట రజేశ్వర స్వామి దేవాలయంలో జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్, జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు డాక్టర్ గొల్లపెల్లి చంద్రశేఖర్ గౌడ్ మాదవి లత దంపతుల ఆధ్వర్యంలో బుధవారం కార్తీక మాసం సందర్భంగా వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ రామచంద్రం గౌడ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆనంద్ గౌడ్, రిటైర్డ్ సీఐ రాజమౌళి గౌడ్, డాక్టర్ జయంతి గౌడ్, డాక్టర్ రాజేందర్, డాక్టర్ గాయత్రి, సత్యనారాయణ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

అక్రిడిటేషన్ కమిటీలో స్థానం కల్పించాలి

జగిత్యాల అర్బన్, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్‌లో ఏర్పాటు చేసే అక్రిడిటేషన్ కమిటీలో జిల్లాలోని ఉర్దూ పాత్రికేయులకు అవకాశం కల్పించాలని జగిత్యాలకు చెందిన ఉర్దూ పాత్రికేయుడు సయ్యద్ అహ్మద్ రాష్ట్ర మైనార్టీ కమిషన్ ఛైర్మన్ తారీఖ్ అన్సర్‌కు వినతిపత్రం అందించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కథలాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోసాని పేటలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జవిడి రఘుపతిరెడ్డి కుటుంబాన్ని బుధవారం సాయంత్రం వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను మృతుని కుటుంబ సభ్యులను అడిగి తెలుసు కున్నారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా గడ్డం భూమారెడ్డి, మామిడిపల్లి రవి, మల్యాల రమేశ్, దొప్పల జలంధర్, ముదాం నరేశ్, కిరణ్, రామాంజనేయులు, దశగౌడ్, ముజీబ్ తదితరులు ఉన్నారు.

●భీమారం: భీమారం మండలంలోని గోవిందారం, ఒడ్యాడ్ గ్రామాల్లోని పలు బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ వేములవాడ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు బుధవారం పరామర్శించారు. ఈ మేరకు వారికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి వెంట మండల అధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, నెల్లుట్ల ప్రభాకర్, అజిత్ రావు, లోలపు రాజరెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, రవీందర్ రావు, ఆదిరెడ్డి తదితరులు ఉన్నారు.

●భీమారం: మండలంలోని కమ్మరిపేట గ్రామానికి చెందిన చుక్క రాజేశం, రాగోజీపేట గ్రామానికి చెందిన చిలువేరి నర్సయ్యలు మరణించగా బుధవారం భీమారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో ఉరుమట్ల లక్ష్మణ్, రెండ్ల మధు, బొమ్మెన ప్రశాంత్, చెక్కపెల్లి సంజీవ్, ఎనుగంటి హరీష్, బూరం అరుణ్, పడాల వెంకటాచారి పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు




జగిత్యాలలో ఇందిరాగాంధీకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ దేశ సంఘటితానికి ఇందిరాగాంధీ విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్‌లు అడువాల జ్యోతి, గిరి నాగభూషణం నాయకులు బద్దం జగన్మోహన్ రెడ్డి, పంబాల రాము, చెట్‌పెల్లి సుధాకర్, తిరుమలయ్య, ప్రభాత్ సింగ్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

●జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఇందిరా గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పాత బస్టాండ్ చౌరస్తాలో గల ఇందిరా గాంధీ విగ్రహానికి పూల మాలలో వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి బండ శంకర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మీ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త మోహన్, తాటిపర్తి రామచంద్రారెడ్డి, పుల్లూరి సత్యనారాయణ, రాగుల ప్రదీప్ పాల్గొన్నారు.

●మెట్‌పల్లి టౌన్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద గల ఇందిరా గాంధీ విగ్రహానికి కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు నివాళులర్పించారు. కార్యక్రమంలో కోరుట్ల పట్టణ నియోజకవర్గ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, మహేందర్, మహిళా పట్టణ అధ్యక్షులు బబ్బురి లక్ష్మి పాల్గొన్నారు.

●రాయికల్: పట్టణంలోని గాంధీ చౌక్‌తో పాటు మండలంలోని మైతాపూర్‌లో ఇందిరాగాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజు రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మేకల రమేష్, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్ గౌడ్, కొయ్యడి మహిపాల్ రెడ్డి, బాపురపు నర్సయ్య, మండ రమేష్ పాల్గొన్నారు.

●కొడిమ్యాల: మండల కేంద్రంలోని అంగడి బజారులో ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలువేరి నారాయణగౌడ్, టీపీసీసీ నాయకుడు మహిపాల్‌రెడ్డి, కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లిఖార్జున్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు అజయ్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

●మల్యాల: మల్యాలలోని సోనియా ఆలయం వద్ద ఇందిరాగాంధీ విగ్రహంకు పూల మాలల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆనందరెడ్డి, రాంలింగారెడ్డి, ఆదిరెడ్డి, వెల్మ లక్మారెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, శనిగారపు తిరుపతి పాల్గొన్నారు.

●పెగడపల్లి: ఇందిరాగాంధీ జయంతి వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కడారి తిరుపతి, చెట్ల కిషన్, మహేష్, వంశీదర్‌రావు, ప్రశాంత్ మధుసూదన్‌రెడ్డి, ప్రవీణ్, మహిపాల్ పాల్గొన్నారు.

●ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ రాజు, వైస్ ఛైర్మన్ వెంకటిరెడ్డి పాల్గొన్నారు.

●కథలాపూర్: ఇందిరాగాంధీ జయంతి వేడుకలు బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి రాధాకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్లు ఉన్నారు.

●వెల్గటూర్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద ఇందిరా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేంధర్‌రెడ్డి, ఎండపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు గూడ రాంరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ గోళ్ళ తిరుపతి, మాజీ సర్పంచ్ మెరుగు మురళి, గంధ్ర శ్రీకాంత్‌రావు పాల్గొన్నారు.

●మల్లాపూర్: ఇందిరాగాంధీ జయంతి వేడుకలను మల్లాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ జడ్పీటీసీ జలపతిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు.

●భీమారం: మండల కేంద్రంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, నాయకులు నరేష్, మల్లేశం, లక్ష్మణ్, ఎండీ సయ్యద్ పాల్గొన్నారు.

'సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి'

పెగడపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల ప్రజలు, యువత అప్రమత్తంగా ఉండాలని పెగడపల్లి ఎస్ఐ ఇకిరణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం పెగడపల్లి మండల కేంద్రంలోని వైష్ణవి స్కూల్‌లో సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, సోషల్ మీడియా యొక్క ఉపయోగాలు, దుష్పరిణామాలు గురించి విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కిరణ్ కుమార్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ లో వచ్చే అనవసరమైన లింక్‌లు ఓపెన్ చేయొద్దని, బ్యాంక్ అధికారులమంటూ చేసే ఫోన్ కాల్‌ల పట్ల జాగ్రత్తంగా ఉండాలని, ఓటిపిలు చెప్పి మోసపోవద్దని సూచించారు. అనుకోకుండా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నెంబరుకు కాల్ చేయడంతో పాటు స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయాలన్నారు.

●ఇబ్రహీంపట్నం, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత సైబర్ నేరాలు, డ్రగ్స్ మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, మంచిగా చదువుకోవాలని ఎస్ఐ అనిల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు సైబర్ క్రైమ్స్ డ్రగ్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ విషయంలో విద్యార్థులు, యువత జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా మిల్లర్లు ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొడిమ్యాల, నవంబరు19(ఆంధ్రజ్యోతి) : రైస్ మిల్లర్లు ఎలాంటి ఆంక్షలు లేకుండా ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూలో రైతుల సమస్యలు పరిష్కరించడానికి రైస్ మిల్లర్లతో, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బందుల పాలు చేస్తె సహించమని హెచ్చరించారు. రైతులతోనె రైస్‌మిల్లుల మనుగడ ఉంటుందని రైతులను ఇబ్బందుల పాలు చేసినట్లయితె స్వయంగా నేనె వచ్చి ఆందోళన కార్యక్రమాలు చేపట్టుతానని హెచ్చరించారు. కొందరు రైస్ మిల్ ఓనర్లు ప్రభుత్వంపై బురదజల్లె ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమని, రైతుల పక్షం అని అన్నారు. మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ లేని విదంగా వరి కోతల సమయంలో వర్షాలు కురవటంతో ధాన్యం దెబ్బతిన్నదని పలువురు రైస్ మిల్లర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకపోయారు. రంగు మారిన ధాన్యాన్ని ఎఫ్‌సీఐ తీసుకోవటం లేదని మిల్లర్లు తెలిపారు. చొప్పదండి నియోజక వర్గంలోని కొడిమ్యాల మండలానికి ఇద్దరు, మల్యాల మండలాలకు ఒక్క సీవిల్ సప్లై డీటీ స్థాయి అధికారులను నియమించి కొనుగోలు కేంద్రాలలో, మిల్లులో ఉన్న సమస్యలను పరిష్కరించె విదంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రైస్ మిల్లర్లు, డీఆర్‌డీవో రఘువరణ్, డీఎస్‌వో జితెందర్‌రెడ్డి, కొడిమ్యాల తహసీల్దార్ కిరణ్‌కుమార్, మల్యాల తహసీల్దార్, ఏపీఎం మల్లేశం, ఫుడ్ ఇన్స్‌పెక్టర్ నర్సింహస్వామి, ఆర్.ఐ కరుణాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణగౌడ్, ముత్యం శంకర్‌గౌడ్, స్వామి, మల్లేశంయాదవ్, అజయ్‌గౌడ్, శ్రీనివాస్ ఉన్నారు.

27న బహిరంగ వేలం

కొడిమ్యాల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండలంలోని నల్లగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో పట్టెనామాలు, మరియు కోరమీసాలు అమ్ముకొను హక్కు, కొబ్బరి ముక్కలు ప్రోగు చేసుకొనుటకు హక్కు పొందుటకు ఈ నెల 27న గురువారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో ఉడుతల వెంకన్న తెలిపారు. 2026 జనవరి 27 నుండి ఫిబ్రవరి 2, 2026 వరకు కాలపరిమితి ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు పట్టె నామాలు, కోరమీసాలు అమ్ముకొనుటకు హక్కు పొందుటకు గాను 1లక్ష రూపాయల డిపాజిట్, కొబ్బరి ముక్కలు ప్రోగు చేసుకొను హక్కు పొందుటకు 30 వేల రూపాయల డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు.

అయ్యప్ప ఆలయంలో వసతులు కల్పించాలని వినతి

జగిత్యాల అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని అయ్యప్ప సేవా సంఘం ట్రస్ట్ సభ్యులు బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

అయ్యప్ప ఆలయంలో జరిగే మండల పూజా, మకర జ్యోతి పూజలకు మున్సిపల్ తరపున లైటింగ్, సౌండ్ ఏర్పాట్లు చేయాలని దీంతో పాటు వచ్చే భక్తుల సౌకర్యార్థం శానిటేషన్ ఎప్పటికప్పుడు శుద్ధి చేయాలని ఎమ్మెల్యేకు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడువాల లక్ష్మణ్, తిరుమలయ్య, మనాల కిషన్, బండారు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసా అందేదెన్నడో..?

(ఐదో పేజీ తరువాయి)

మొక్కజొన్న 2,176 క్వింటాళ్లు, మినుము 515 క్వింటాళ్లు, పెసర 117 క్వింటాళ్లు, ఆవాలు 46 క్వింటాళ్లు, నువ్వులు 470 క్వింటాళ్లలో అవసరవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈమేరకు ఎరువులు, విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం ముందుకు వచ్చి రైతు భరోసా అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఘనంగా కార్తిక దీపోత్సవం



ఆలయంలో కార్తిక దీపాలు వెలిగించిన భక్తులు

కోరుట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొటి నవదుర్గ దేవాలయంలో మంగళవారం కార్తిక మాసం ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో వేద పండితులు శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ ఆవరణలో సహస్ర దీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘ నాయకులు జిల్లా దనంజయ్, గుంటుక ప్రసాద్‌లతో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ పాఠశాలలో ఎల్లో డే



వేడుకల్లో పాల్గొన్న అల్ఫోర్స్ విద్యార్థులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివవీధిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో ఎల్లో కార్నివాల్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ వేడుకల్లో భాగంగా ఎల్లో టవర్, హౌస్, ఫ్రూట్స్, పేపర్స్ టికెట్స్ హాల్, వాల్ తదితర అంశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎం సహాయ నిధిపై అవగాహన కల్పించాలి

కోరుట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పీఎం సహాయ నిధి యోజనపై వీధి వ్యాపారులకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ రవీందర్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వివిధ బ్యాంకు ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు సలహాలను అందించారు. వీధి వ్యాపారులకు అందిస్తున్న రుణాలు వాటిపై విధించే వడ్డీలను వివరాలను వీధి వ్యాపారులకు సూచించాలని తెలిపారు. ఇప్పడి వరకు వచ్చిన దరఖాస్తుల వివరాలు వాటిపై పరిష్కారం చేయ్యవలసిన వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల డీఏలను విడుదల చేయాలి

ధర్మపురి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన ఐదు డీఏలను తక్షణమే ప్రభుత్వం ప్రకటించాలని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గజభీంకార్ గోవర్ధన్ కోరారు. ధర్మపురి మండల కేంద్రంలో టీఆర్‌టీఎఫ్ (తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్) మండల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు గోవర్ధన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డీఏలను ప్రకటించి నూతన పీఆర్‌సీ అమలు చేయాలని ఆయన అన్నారు. అనంతరం ధర్మపురి మండల టీఆర్‌టీఎఫ్ అధ్యక్షులుగా బండారి సతీష్, ప్రధాన కార్యదర్శిగా మెరుగు రమేష్, అసోసియేట్ అధ్యక్షులుగా దేవకి వెంటకరమణ, అదనపు ప్రధాన కార్యదర్శిగా బెజ్జంకి నితిన్, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, ఒజ్జల మహేష్, దాసరి రాజన్న, సంద వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా పురంశెట్టి సత్యనారాయణ, ఈశ్వరుడు, సందారికారి రాజేష్, కనుకయ్య, మదు, మహిళా కార్యవర్గ సభ్యులుగా చుంచుకాల సింధూజ, కోయల్‌కార్ శిరీష, సునీత,

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రాంతీయ ఉపాధి కల్పన అధికారి రవిందర్

రాయికల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ ఉపాధి కల్పన ప్రాంతీయ అధికారి బెజ్జారపు రవీందర్ అన్నారు. చదువు, సంస్కారాలకు ప్రాధాన్యత ఇచ్చిన విద్యార్థులు భావిజీవితంలో ప్రత్యేకంగా ఎదిగి అనుకున్నది సాధించగలుగుతారని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ ఉపాధి కల్పన ప్రాంతీయ అధికారి బెజ్జారపు రవీందర్ అన్నారు. రాయికల్ పట్టణంలోని బాలుర, బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీపతి రాఘవులు, ప్రధానోపాధ్యాయులు కాపు శ్రీనివాస్, గట్టు రమేష్, నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు చేయాలి

కొడిమ్యాల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : రైతులు ఆయిల్ పాం సాగు చేయాలని హార్టికల్చర్ ఏఈవో అనిల్ అన్నారు. బుధవారం మండలంలోని తిర్మాలాపూర్ రైతు ఐక్య వేదికలో ఆయిల్ పాం సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఏఈవో మాట్లాడుతూ రైతులు ఆయిల్ పాం సాగు వైపు మొగ్గు చూపాలని కోరారు. ఆయిల్ పాం సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహకాలను గురించి అవగాహన కలిపించారు. ఆయిల్ పాం సాగు చేసిన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. ఆయిల్ పాం పంట ప్రాముఖ్యత, మార్కెటింగ్ తదితర అంశాలపై అవగహన కలిపించారు. ఈ అవగాహన సదస్సులో తిర్మాలాపూర్ సింగిల్ విండో కార్యదర్శి కుర్షీద్ అహ్మద్, ఏఈవో గ్రీష్మ, పాం ఆయిల్ ఫీల్డ్ ఆఫీసర్ లక్మన్, పలువురు రైతులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ధర్మపురి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది గ్యాస్ లీక్ అయిన సమయంలో, వరదలు వచ్చేటపుడు ఏ విదమైన జాగ్రత్తలు తీసుకోవాలో చాలా చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి అగ్నిమాపక సిబ్బంది లక్ష్మీనారాయణ, పాఠశాల హెచ్‌ఎం టి. కళావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వం



మొక్కజొన్న నిల్వలను పరిశీలిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పడించిన పంట కొనుగోలు చేయడంలో జాప్యం చేస్తూ విక్రయించిన మొక్కజొన్న పంటకు రైతులకు డబ్బులు చెల్లించక ఇబ్బందుల పాలు చేస్తుందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని మార్కెట్ కమిటీలో మొక్కజోన్న కొనుగోలు కేంద్రంను స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సందర్శించారు. కేంద్రంలో నిలువ ఉన్న మొక్కజోన్న నిలువల వివరాలను సంబదింత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, రైతు సమన్వయ కమిటి జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకటరావు, మాజీ సర్పంచ్‌లు బాస్కర్ రెడ్డి, వనతడుపుల అంజయ్య నాయకులు తుక్కారెడ్డి, పిడుగు సందయ్య, గోపాల్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేత

కోరుట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు బుధవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ప్రొసిడింగ్ పత్రాలను అందించారు. పట్టణంలోని కోరుట్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 27 మంది లబ్దిదారులకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ప్రొసిడింగ్ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతుల ఇక్కట్లు

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల రాష్ట్రంలోని రైతులు సాగు మొదలు పంటు విక్రయించుకునేంత వరకు ఇబ్బందులు పడుతున్నరని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ విమర్శించారు. బుధవారం మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించి మొక్క జొన్న, వరి కొనుగోళ్లను మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డితో కలిసి పరిశీలించారు. మార్కెట్ యార్డులోని పారిశుధ్యం, తూకం యంత్రాల పనితీరు, గోదాముల స్థితి, రైతులకు కల్పించిన వసతులను పరిశీలించి మార్కెట్ యార్డుకు వచ్చిన రైతులకు వసతులు కల్పించాలని కార్యదర్శికి ఆదేశించారు. మొక్కజొన్న పంట విక్రయించి 20 రోజులైన డబ్బులు పడలేదని, వేలిముద్ర విధానంతో సరిగా రాక అలస్యమవుతుందని రైతులు సమస్యలను ఎమ్మెల్యేకు తెలిపారు. తూకం వేసిన ధాన్యం డబ్బులు త్వరగా వచ్చేలా, మ్యాచర్ వచ్చిన వాటిని వెంటనే తూకం వేయాలని, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని తహసీల్దార్ నీతకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, నాయకులు గడ్డం రాజారెడ్డి, ఓజ్జెల శ్రీనివాస్, అంగడి పురుషోత్తం, అనిరెడ్డి మారుతి, నిర్వహకులు జెట్టి నర్సయ్య, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందిని అభినందించిన ఆర్ఎం

కోరుట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల ఆర్‌టీసీ డిపోకు చెందిన సిబ్బందిని బుధవారం కరీంనగర్ రీజినల్ కార్యాలయంలో బుధవారం ఆర్ఎం రాజు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ భూపతి రెడ్డి అభినందించారు. కోరుట్ల ఆర్‌టీసీ డిపో నుండి అధిక పుణ్య క్షేత్రాల టూర్, ప్యాకేజీ, పెండ్లీ, విహార యాత్రలతో పాటు శబరిమల యాత్రకు బస్సుల బుకింగ్‌లో చురుకుగా పాల్గొని విజయవం చేసినందుకు డిపో కండక్టర్ బందెల రమేష్, మెకానిక్ నారాయణలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ మనోహర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

మెట్‌పల్లి టౌన్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో మహిళాభివృద్ధి శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఐసీడీఎస్ సీడీపీఓ మణెమ్మ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తదితరులు పాల్గొని బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. అలాగే మత్తుపదార్థాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించి, చట్ట పరిధిలో కలిగే శిక్షల గురించి, వాటి చట్టాల గురించి వివరించారు. బాల్యవివాహాలు లేని భారత దేశం చూడాలని వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ పరిశీలకులు ప్రతిభ, హెచ్‌ఎం కాంతార, అంగన్‌వాడీ టీచర్ నజీమా, పద్మ, శ్రీదేవి, చైత్ర, విజయలక్ష్మి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు అందించారు.

●మెట్‌పల్లి రూరల్ : బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు జరుగుతాయని, పెళ్లి చేసుకుంటే ఆరోగ్య సమస్యలు వస్తాయని మండల వైద్యాధికారి శివాని, చైల్డ్ కేర్ అధికారి రజిత అన్నారు. బుధవారం మండలంలోని జగ్గసాగర్ ప్రభుత్వ పాఠశాలలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన బాల్య వివాహాలపై అవగాహన చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టం-2026, పోక్సో చట్టం-2012, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వల్ల కలిటే నష్టలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహేశ్వరి, ఏఎన్ఎం లావణ్య, అంగన్‌వాడీ టీచర్లు పూలమ్మ, శారద, ఆశాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి చర్యలు

పెగడపల్లి, నవంబరు19 (ఆంధ్రజ్యోతి) : మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పెగడపల్లి మార్కెట్ ఛైర్మన్ బుర్ర రాములు గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత చీరల పంపిణీ ప్రారంభాన్ని హర్షిస్తూ బుదవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చిత్రపటాలకు క్షీరాబిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, నాయకులు ఒరుగల శ్రీనివాస్, సంధి మాల్లారెడ్డి, కడారి తిరుపతి, భాస్కర్, కృష్ణహరి, వంశీదర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పెగడపల్లి, నవంబరు19 (ఆంధ్రజ్యోతి) :పెగడపల్లి మండలంలోని పలు గ్రామాలలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బుదవారం పరామర్శించారు. నంచర్ల గ్రామానికి చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ వేల్పుల రామక్క, అమిరిశెట్టి అంజయ్య, మండల కేంద్రానికి చెందిన గంధ్ర దేవెందర్ రావు లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బుదవారం వారి వారి ఇండ్లకు వెల్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ మంత్రి ఈశ్వర్ వెంట పార్టీ అధ్యక్షులు లోక మల్లారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కరుణాకర్ రావు, నాయకులు ఉన్నారు.

ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ఇబ్రహీంపట్నం, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోళ్లలో తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కేంద్ర నిర్వాహకులకు తహసిల్దార్ వర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని గోదూర్, ఇబ్రహీంపట్నం గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. తేమ శాతం వచ్చిన వాటిని త్వరగా తూకం వేసి, మిల్లులకు తరలించాలని తెలిపారు. రైతులకు ధాన్యం డబ్బులు 48గంటల్లో జమ అవుతాయని పేర్కొన్నారు.